# అంకితం


## పాలకూర సీతాలత

హైమవతి భర్త దగ్గర్నుంచి ఉత్తరం అందుకోగానే మురిసిపోయింది. ఆత్రంగా చదివింది. ఈ హైదరాబాదుకి దూరంగా ... చాలా దూరంగా... కొన్నివేల మైళ్లదూరంగా ఉద్యోగం చేసుకుందుకు అమెరికా వెళ్ళిపోయాడు ఆమె భర్త సురమౌళి. అతను తనకు దూరం అయిన ఈ నాలుగు నెలలుగా ఆమె మనసు మనసులోలేదు. రెండు నెలల క్రితం ఆమెకు కొడుకు పుట్టినపుడు కూడా ఇంతగా ఆనందపడలేదు. ఆ ఆనందాన్ని మించిపోయిన ఆనందం ఇప్పుడు ఈ ఉత్తరం అందుకోవడం.

ఆ ఉత్తరం మరొక్కసారి చదువుకుంది. అందులోని ప్రతి అక్షరం ఒక తేనెబొట్టులాగ... ప్రతివాక్యం ఒక మధుర గీతం లాగ... ఆమె మనసును ఉయ్యాలలూపుతూ, కోనసీమ ప్రకృతి సౌందర్యాన్ని ప్రతిబింబిస్తూ... ఆమెను పరవశింపచేశాయి.

కన్నబిడ్డను కళ్ళారా చూసుకున్నాకే అమెరికా వెళ్లాలని నిర్ణయించుకున్నాడు సురమౌళి. కానీ పరిస్థితులు కలిసిరాలేదు. ఫలానా తేదీలోగా రాకపోతే ఇక ఆ ఉద్యోగానికి నీళ్లు వదులుకోవాల్సి వస్తుందని ఉత్తరం వచ్చింది. చాలా మంచి ఉద్యోగం అది. బోలెడు సంపాదన. ఒక అయిదు సంవత్సరాలు అక్కడ వుంటే లక్షలు మూటగట్టుకోవచ్చు. అందుకే వెళ్లక తప్పలేదు అతనికి. బిడ్డ పుట్టాకా చూడడానికి రమ్మంటూ ఉత్తరం రాసింది భర్తకు హైమవతి. అంబాజీపేటలో వుంటూ అమలాపురం వెళ్లిరావడమంత తేలికకాదు అమెరికా నుంచి హైదరాబాదు రావడం. చదువుకున్న హైమవతికి ఆ విషయం తెలియకా కాదు. కానీ ఏదో చెప్పలేని ఒక ఆత్రంలో ఆమె భర్తకు అలా రాసింది. ఇప్పుడు సురమౌళి రాసిన ఉత్తరంలో అదే రాశాడు. 'చిన్నబాబును చూసుకోవాలని నా మనసు ఉవ్విళ్ళూరుతోంది. చిన్నచోట వుండలేక ఏదో తెలియని ఆత్రంతో, అనుక్షణం, బాబు రూపాన్ని ఊహించుకుంటూ కాలం గడుపుతున్నాను. ఇక్కడ వున్న ఏ క్షణమూ మిమ్మల్ని మరిచి పోవడం సాధ్యం కాదు. నువ్వు, బాబు నా రెండు కళ్లు. మన శరీరాల మధ్య దూరం వేలాది మైళ్లు వున్నా, మన మనసులు కలిసేవున్నాయి. వుంటాయి. బాబును చూడాలని ఎంత కోరిక వున్నా రాలేని అశక్తుడిని. అర్థం చేసుకుంటావ నుకుంటాను.

ఆ మాట నిజం అని హైమవతికి తెలుసు. అయినా ఏదో చెప్పలేని ఒక



వెలితి ఆమెకు కలిగింది. తన కన్నబిడ్డను భర్త చూసేది చాలా సంవత్సరాల తర్వాత అన్న విషయం ఆమెకు కించిత్తు బాధ కలిగిస్తోంది.

భర్త రాసిన ఉత్తరాన్ని చిన్నగా ముద్దుపెట్టుకుని, లేచి లోపలకు వెళ్లింది. పెట్టెలో ఆ ఉత్తరాన్ని పదిల పరుచుకుంది. మంచం మీద నిద్రపోతున్న బాబును ఆప్యాయంగా తాకింది.

'మీ నాన్నగారు నిన్ను ఎప్పుడు చూసుకుంటారురా? ' అంది చిన్నగా.

తర్వాత బాబు పక్కనే పడుకుని ఏదో పుస్తకం తీసింది.

పేజీలు తిప్పుతూ చూడసాగింది.

ఒక చోట ఆమె చూపులు నిలిచిపోయాయి.

నెమ్మదిగా చదివింది. మరొకసారి చదివింది.

అలా రెండు మూడుసార్లు చదివింది... ఏదో ఆలోచన.

* * *

ఆ మర్నాడే ఆమె భర్తకు ఉత్తరం రాసింది. అందులో ఆమె ఒక విషయం గురించి ప్రత్యేకంగా రాసింది. తప్పకుండా పని జరుగుతుందని అనుకుంది.

ఆ తర్వాత ఆ ఉత్తరానికి జవాబుగా సురమౌళి ఉత్తరం రాసేడు. అందులో భార్య ... సూచించిన విషయాలకి సంతోషం వ్యక్తం చేశాడు. ఆ వ్యవహారంలో ప్రత్యేకమైన ఆసక్తి చూపిస్తున్నట్లు ఆ రోజే మరొక ఉత్తరం వాళ్లకి రాస్తున్నట్లు రాశాడు. భార్యా భర్తల మధ్య ఉత్తరాలు నడుస్తున్నాయి.

ఒకసారి సురమౌళి రాసిన ఉత్తరంలో మామూలు విషయాలు రాసేకా ఆ విషయం గురించి రాసేడు. ఆ వ్యవహారంలో కొన్ని అభ్యంతరాలు వచ్చాయట. అయినా నిరాశపడవల్సిన అవసరం లేదనీ... ఆ అభ్యంతరాలన్నింటినీ అధిగమించగల ధైర్యం వుందనీ రాసేడు.

మరొక నాలుగు నెలలు గడిచి పోయాయి.

* * *

ఆ రోజు ఆ ఇంట్లో పండుగ... హైమవతి కళ్లలో మెరుపు.

అందుకు కారణం సురమౌళి రాక.

కొడుకుని ఎత్తుకుని ముద్దులు పెట్టు కున్నాడు సురమౌళి. ఆ దృశ్యం నేత్రపర్వంగా తోచింది హైమవతికి.

భర్త మరొక అయిదు సంవత్సరాల దాకా రాడనుకుంది. అంత వరకూ చిన్నబాబుకి తండ్రిని చూసే అదృష్టం లేదనుకుంది. కానీ భగవంతుడే చూపించినట్లుగా ఒక అవకాశం ... బంగారు అవకాశం ... తన భర్తకు దొరికింది. ఆ కారణంగానే స్వంత ఖర్చు ఒక్క పైసా కూడా కాకుండా అతను అక్కడ నుంచి, ఆ .అమెరికానుంచి హైదరాబాదు రాగలిగాడు. అతనికి ఖర్చు కేవలం సెలవు. పై అధికారుల్ని ఒప్పించి దాన్ని సంపాదించుకున్నాడు. అంతే హైదరాబాదు వచ్చేశాడు. పని పూర్తి చేసుకుని వెళ్లిపోతాడు.

"చెప్పు హైమా ఏమిటి విశేషాలు?" అన్నాడు సురమౌళి అనురాగంతో భార్య కళ్లలోకి చూస్తూ.

హైమ సిగ్గుతో తలవంచుకుంది "ఏమీలేవు" అంది చిన్నగా.

ఆ మాట నిజమే విశేషాలన్నీ తరుచు రాసుకునే ఉత్తరాల ద్వారా తెలియచేసుకుంటూనే వున్నారు. కొరత అల్లా భౌతికంగా కలుసుకోవడమే. అది ఇప్పుడు జరిగింది.

ఆ రాత్రి వెన్నెలలో డాబామీద ఎన్నో ఊసులాడుకుంటూ ఒకరి కౌగిట్లో ఒకరు కరిగిపోతూ ఇంచుమించు నిద్రకు దూరమయ్యారు.

ఆ మర్నాడు ఉదయం సురమౌళి తయారయ్యాడు.

"అలా వెళ్లి వస్తాను" అన్నాడు భార్యతో.

"ఎక్కడికి? ఆంధ్రభూమి ఆఫీసుకా?" అంది హైమవతి.

"అవును వాళ్ల ఖర్చుల మీదే కదా ఇక్కడకు రాగలిగింది. కనుక ఆ పని చెయ్యడం ముఖ్యం వెళ్తాను. వాళ్లకోసం

కొన్ని కథలు సెలక్టు చేసి వస్తాను. ” అన్నాడు అతను.

“అలాగే మీరు అమెరికా వెళ్ళిపోయాక తోచటంలేదని అరడజను కథలు రాసి ఆంధ్రభూమికి పంపేను. అవన్నీ సెలక్టు చేసెయ్యండి. ” అంది హైమవతి.

“అలాగే తప్పకుండా” అంటూ వెళ్లిపోయాడు సురమౌళి.

ఆంధ్రభూమి వారపత్రిక ఒక కొత్త స్కీము పెట్టింది.

పాఠకుల్ని ఎడిటరుగా మార్చే స్కీము అది. ఆ కార్యాలయానికి వచ్చిన కథల్ని పరిశీలించి ఎన్నిక చేసే అవకాశం పాఠకులకి ఇస్తారు. స్త్రీ, పురుషుల్లో ఎవరైనా ఫర్వాలేదు. ఆసక్తి ఒక్కటే దానికి అర్హత. ఏ ప్రాంతం వారయినా పాల్గొనవచ్చు. పొరుగూరు నుంచి వచ్చే వారికి దారి ఖర్చులు ఆంధ్రభూమే భరిస్తుంది. వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తుంది.

చాలా వ్యయంతో కూడుకున్నది కనుక, బిడ్డ పుట్టినా హైదరాబాదు రావడం కుదరదని సురమౌళి రాసేకా ఒకరోజు ఈ ప్రకటన హైమవతి కళ్లబడింది. దాన్ని చింపి భర్తకు పంపింది. సురమౌళి తన ఫోటో, చిరునామా తెలియబరుస్తూ ఆంధ్రభూమికి ఉత్తరం రాశాడు. కథలు సెలక్టు చేసే ఆసక్తి తనకు వుందని.

దాంతో ఆంధ్రభూమి వారు తారెత్తిపోయి 'ఈ సౌకర్యం కేవలం ఇండియాలో వున్న వాళ్ళకి మాత్రమే' అని జవాబు రాశారు సురమౌళికి' ఆ విషయం ప్రకటనలో లేదు కనుక అమెరికాలో వున్న తెలుగువాడు కూడా రావచ్చునని, ఇలా అనడం అన్యాయం అనీ, ప్రస్తుతం తను ప్రపంచంలో పశ్చిమ ప్రాంతానికి చెందినవాడిననీ, న్యూయార్క్ హైదరాబాద్‌కి పొరుగూరేననీ' రాసేడు సురమౌళి.

దాంతో సురమౌళికి దారి ఖర్చులు ఇచ్చి పిలిపించక తప్పలేదు ఆంధ్రభూమికి. సురమౌళి ఔదార్యం ప్రకటిస్తూ వసతి సౌకర్యాలు ఖర్చు మినహాయిస్తున్నానన్నాడు (అతనికే ఇల్లు వుందిగా...)

ఆ కారణంగానే సురమౌళి రాగలిగేడు.

అతను ఆంధ్రభూమి కార్యాలయానికి వెళ్ళి, కొన్ని కథలు చదివి పది కథలు సెలక్టు చేశాడు. అందులో అయిదు కథలు హైమవతి రాసినవే.

ఆంధ్రభూమి కూడా మురిసిపోయింది. అమెరికా నుంచి కూడా తమ కార్యాలయానికి కథలు సెలక్టు చెయ్యడానికి ఒక మనిషి వచ్చినందుకు...

మరొక వారం రోజులు భార్యా బిడ్డలతో ఆనందంగా కాలం గడిపి, ఆంధ్రభూమి ఖర్చుతో అమెరికా ప్రయాణమయ్యాడు సురమౌళి.

హైమవతి బేగంపేట విమానాశ్రయానికి వచ్చింది. బొంబాయి దాకా కూడా విమానంలోనే వెళ్తున్నాడు సురమౌళి.

“ఈ ట్రిప్పుకి కారణం ఆంధ్రభూమి. దాన్ని నేను మరువలేను. నువ్వు ఆంధ్రభూమిని ప్రతీ వారం కొను. మానెయ్యకు...” అన్నాడు సురమౌళి విమానం ఎక్కబోతూ.

“అలాగే” అంది హైమవతి.

“థాంక్సు టు ఆం. క. ముం. అ...” అన్నాడు సురమౌళి.

అర్థం కాలేదు హైమవతికి.

“అదేమిటి?” అంది.

చెప్పాడు సురమౌళి. ఆం.క.ముం.అ. అంటే ఆంధ్రభూమిలో కథలు ముందుగానే చదివే అవకాశం అట”

విమానం ఎక్కి వెళ్ళిపోయేడు సురమౌళి.

ఆ తర్వాత ఆంధ్రభూమి ఆం.క.ముం.అ ప్రకటనలో చిన్న మార్పు వచ్చింది.

“ఆంధ్రరాష్ట్రంలో మీరు ఏ ప్రాంతం వారయినా సరే... పాల్గొనవచ్చు. పొరుగూరు నుంచి వచ్చేవారికి దారి ఖర్చులు మేమే భరిస్తూ, వసతి సౌకర్యాలు కూడా ఏర్పాటు చేస్తాం” అని వుంది ప్రకటనలో.


“ఆంధ్రరాష్ట్రంలో ...” అన్న పదం జోడించబడింది.

ఈ రకంగా పాపం... ప్రవాసాంధ్రులకు కొంత అన్యాయం జరిగింది... సురమౌళి కారణంగా...

*


107 స్పెషల్
డిటర్జెంట్ బార్.

ఇది యిచ్చే ఎక్కువ
తెల్లదనానికి కారణం?
దీనిలో వున్నది-'గుట్టుగా'
తెల్లపరిచే పదార్థం!




107 స్పెషల్ డిటర్జెంట్ బార్ సోపులోనే వుంది. ప్రత్యేక తెల్లదనం యిచ్చే సీక్రెట్ ఏజెంటు. అధికమైన తెలుపుకీ మెరుపుకీ ఇదే కారణం.

ఒత్తుగా వచ్చే నురగలు మురికిని వదలగొడతాయి. అంతేకాదు - యీ బార్ సోపు మంచి అదా కూడా.

ఉత్పత్తిదారులు :
ఆల్ట్రా మరైన్ అండ్ పిగ్మెంట్సు లిమిటెడ్
రాణిపేట-642 403